# పాలెంలో దీపాలవరాశ

ఎల్లురు ; బెమ్మాండంగా లెగుత్తు డయి మంటలు. సుక్కల్లూత్తుండయి సిచ్చు బుడ్లు. యాడజూసినా ఎర్ర మతాబులు పచ్చమతాబులు ముత్తాల పూత్తులు, కాకర పూత్తులు సిలకలు పాలపిట్టలకి మల్లే పటపట బగబగ దలతల మంటంటే, యీది మలుపున మంటపం తంబాన్ని వాలేసుకుని దుష్టి సెదరకండా సూత్తుండ చీతాయి, ఒక్కపాలి ఎగశాస బీల్సి దిగనాదలేతలికి బొడ్డుకాడ గెజ్జలు గెల్లుమన్నయి సిదర్లో ఎగదోసినట్టు.

'యాడికిబోయినా యియుంటయి నాకు లింగమయ్యకు మల్లే.' అంటా మడత మీన మడతేసి గెజ్జల్ని బొడ్డోకి దోపాడు చీతాయి అటీటు సూత్తా.

పొద్దత్తమాసం వుత్త రోల్రోకల్తో వూరెల్లా దిరిగి, యింటికెల్లి సందేల బువ సరిపడక, సీకటైనాక సల్లగావొచ్చి మంటపం తంబాన్ని వాలేసుకుని సూత్తుండాడు చీతాయి.

మొదులు రోల్రోకలి మందు చంగతి ఆట్టుంచీ, సూరేకారం గెందకం యాడన్నా తంటాలుబడ్డా, యిస్కోల్లో తాడిసెట్టు గులకసళ్ళను సూత్తేనే బాత్తానన్నాడు బుడేసాయిబు.

సీరాములయ్యకొడుకు నారాయన లొల్లి మాటలేగాని అల్లయ్య మువ్వావలా ఇత్తే మళ్ళీ మరనాడిత్తా ఓపావలా బిల్లియ్యారా అంటే, యదవ యియలా.

అంత లోతు బాయిలో బిందెబడ్తే, లటిక్కన మునిగి సావుదప్పి తెచ్చిత్తే 'ఆనక అగుపియి అర్థణా యిత్తా' అన్నాడు అంకమ్మ. ఓడిగ్గావాలా... ఆయిని పిలక్కి తగిలిచ్చుకోమను—

తుస్ మంది తోటా, కోటయ్యగారింటి ముంగల. 'యిహి యిహి, కోటయతోటా పిత్తింది!' అన్నాడు చీతాయి.

'అబ్బ, యిదేందమ్మా యీకప్పగంతు మీనకు లెగుసుద్దీ!' అంటన్నారెవురో కోటయ యింటికాడ.

'అదేందో నీకు దెల్వా?' అన్నారు చీతాయి తంబం రుద్దుతా.

'లెగవ డి. లెగవండి' —'అంటన్నారు కోటయ యింటికాడ.

'ఆరెనాయినా, సిచ్చుబుడ్లు ముట్టిత్తుండా రా! అబ్బ – అదేందీ? కింద బెట్టా ముట్టిచ్చేదీ? యిగ యీళ్ళేంగాలుత్తారు పూత్తులూ! అట్టా యిప్పుడు పున పిల్లో డెలిగిత్తాను. సిచ్చుబుడ్డి ముట్టిచ్చి సేతిలో పొట్టుకుని లగెత్తుతా వుంటే

రవిలుబండికి మల్లే అట్టనే మేగాల్లోకి లెగిసి పోవాల!......సల్లగా ఎల్లి ఓ సిచ్చుబుడ్డి దీసుకు లగెత్తికెల్తే? కోటయ్య గుటకేత్తాడు. రంగమ్మ దిమ్మరపోద్ది! ...సందట్లో ఓడు సూసేది? పదా—" అంటా తంబాకాణ్ణుంచి లెగిసి నెగవటం పుండేల్చద్ద కొట్టినట్టు టపీమనొచ్చి సిచ్చుబుడ్లిని ఎగరేసి లెగనేసి తిప్పుకుంటా 'అదేంది? అదేంది? లగెత్తుందవి సిచ్చుబుడ్డి!——' అని కోటయ్య ముటా నోళ్ళు దెరుత్తుంటే, ఎల్లిన ఎల్టం సిచ్చుబుడ్డి సల్లారాన్న అటనే పొట్టుకుని బసవయగారి సాయిడి కాడి కొచ్చిగాని ఎనిక్కితిరిగి సూడలా చీతాయి, ఎగరొప్పుతా.

'అబ్బ!' అన్నది అడ ఎవుర్దో కంటం.

'వుక్——' మంది చీతాయి గుండె కాడ ఏందో.

'బల్ గమ్మత్తుగుండది!' అంది కంటం మల్లీ.

'అఁ?' అన్నాడు చీతాయి సీకట్లో సూత్తా.

'అదేందిరా? అట్ట అదరగొడ్తివి, చీతాయ్?' అంది కంటం.

'ఎంకాయ్? నువేనంటే—సత్తిని గదంటే అదురుబుట్టి?'

'ఓడు సావమన్నాడూ!'

'ఏం జేత్తుండావే యీడ, ఎంకాయ్!'

'పా అతలికి మీనకొత్తావేం?'

'యీడుండా వేందే, ఎకాయ్?'

'నా యిట్టం, యాడుంటే నీకేం?'

'యాడుండావనుకుంటే యాడా అగుపియకబోతివి?'

'ఓరికి? నీకా? పోరా—'

'ఎంకాయ్?'

'మాలచ్చను—'

'ఏంది!'

'ఏందా, పిల్లిమిసరకాయలు—'

'పిల్లిమిసరకాయలూ – ఏందదీ?'

'ఇదేంది యీడ నిలబడ్డానూ, పిల్లిపోకా-'

'యిదుగో, ఎంకాయోవ్—'

'తాలుందూ – యిడిపియ్ – సెయి పొట్టుకుంటావే-దీ?'

'ఇదిగో, నువనేదేందో తెలపటంలేదు గానీ కూసిని పిల్లిమిసరకాయలు ఆనాదు మాలచ్చి పెట్టమ నడిగితే పెట్టా? ఏం వుండదాడా?'

'ఏంవుందా ? కొ ప్పెగర్దన్నేవోళ్లు లేక, ముంగల దానికి నువెందుకు పెట్టాలా ?'

'బలేదానివి ! కట్టలో సగంకూడా పెట్టలేదు గానీ - పదికాయిలేగా పెట్టింది, నువు సూట్టలా ?'

'సుబ్బారం జెప్పింది.'

'లం - అదిగందికే రగిలేది ! మడ్చని జూసి సెప్పక్కర్లా ఎవురయినా ? అయ్యన్నా పెట్టకనే పొయ్యేవోణ్ణి తెలుత్తె. హుఁ !'

'వూఁ.'

'ఎందుకురా, ఎంకాయి అగుపియదనుకుంటే ఎటదెల్బుద్దీ !'

'పోరా.'

'నీకు తెలవదంటే, ఎంకాయ్, యీచీతాయి ఎసువంటివోడయిందీ ? నువు కొన్రాక వుక్కిరి బిక్కిరయి సత్తంటే !'

'తెల్చుగానీ - యీపాలి ఆ మాలచ్చాంతో మాట్టాణ్ణనూ ?'

'ఆ, అంతే'

'వూఁ !'

'యీడ ఒంటరిగా ఏంజేత్తుండావే, ఎంకాయ్ ?'

'అదిగాదురా, చీతాయ్, ఆయ్యేవోఁ పూత్తులు కొనియలా. అమ్మనడిగితే నేవోఁ నాకుతెలవదు, మీ అయ్యనే అడుక్కోమంది. అమయిన ఏడుత్తా పొండుకుండా.'

'నాకు తెలవదే, ఎంకాయ్ !'

'ఆమయినేఁవో సందేల జేజి సాటుకుదిల్సి పావలా బిల్లిచ్చింది !'

'ఎందుకే యిచ్చిందీ ?'

'ఎర్ర మతాబులు కొనుక్కోను !'

'మీ జేజి బో మంచిదే, ఎంకాయ్ !'

'అమయిన రంగయకొట్టుకాడి కెల్తే నీ అయ్య ఆడ పుగాకు కొంటా వుండాడు. సత్తినా బగమంతుడా అనుకుంటా లగెత్తుకొచ్చా. మల్లీ అయ్య యిప్పుడే ఖువదాగి వూల్లోకెల్లాడూ. అమ్మ సూడకండా యిటు లగెత్తుకొచ్చా. యిగ నువు సిచ్చుబుడ్డితో లగెత్తుకొచ్చావూ, పానం లెగిసొచ్చిందిరా, చీతాయ్ !'

'నాకాడ పూత్తుల్లేవు… …'

'నే నిత్తాగా. నాకాడ పావలాబిల్లుండది గదంట్రా ?'

'మరి నీకు సాలక్కర్లా ?'

'పానీలేరా, ఎతుక్కుంటా వత్తేనీ ! రావంట్రా కొనుకొచ్చుకుందాం ?'

'ఏం కొనుక్కుందాం ?'

'ఎర్ర మతాబూ, పచ్చ మతాబూ – అయ్యో రంగయ కొట్టుకాడుంటాడేవోఁ ?'

'నే ఎల్లి దీసకరానా ?'

'వూఁ. మరి యాడ కాల్చుకుందాం ?'

'యాడ కాల్చుకుందాం ?'

'నాగార్చెమ్మ గుడికాడ ఎవురూ వుండర్రా !'

'ఆదకా... ...?'

'అయితే అయిందిలే. బాగుంటదాండా !'

'ఎంకాయ్ !'

'దబ్బునపోరా. నే అటు తిరిగొచ్చి, నీకోసం ఆడ కూకునుంటా, ఏం ?'

కూసేపుటికి దూరాన నాగార్చెమ్మ గుడికాడ ఎర్రెర్రగా పచ్చ పచ్చగా ఎల్దురు లెగిసింది.

*